# సాక్షి
## వికారాబాద్

శనివారం । 17 । మే । 2025






### సారం లేక.. దిగుబడి రాక

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతుండటంతో భూ సారం దెబ్బతిని పంట దిగుబడి తగ్గుతోంది.

10లో▸



### రోడ్లపైనే వడ్లు!

దౌల్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

10లో▸



### జొన్న పండింది

రబీలో తెల్లజొన్న సాగు చేసిన రైతులు మంచి దిగుబడులు సాధించి లాభాలు పొందుతున్నారు.

11లో▸

### ❖ హ్యాపీ బర్త్ డే



చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య జన్మదినం సందర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యేకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

## న్యూస్‌రీల్

### టెండర్ల ఆహ్వానం

**పరిగి:** పరిగి ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలంలో వ్యాపారం చేసుకునేందుకు ఆసక్తిగల వారి నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎం సుఖందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మార్కెట్ రోడ్డుకు వెళ్లే దారిలో ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలం ఉందని, అందులో వ్యాపారం చేసుకునేందుకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. జూన్ 3వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 7382829480 లో సంప్రదించాలని కోరారు.

### జీపీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

డీపీఓ జయసుధ



వర్మీ కంపోస్టు షెడ్డును పరిశీలిస్తున్న డీపీఓ జయసుధ

**బంట్వారం:** గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని డీపీఓ జయసుధ అన్నారు. శుక్రవారం బంట్వారం, సల్బత్తాపూర్, మద్వాపూర్ జీపీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, వర్మీ కంపోస్టు షెడ్డును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. మురుగు కాల్వలు, వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. అంతకుముందు మాద్వాపూర్ జీపీలో రికార్డులను పరిశీలించారు. బంట్వారంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి గ్లౌజులు, బూట్లు, ఐడీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఎలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

### నూతన నియామకం



నూతన కమిటీ సభ్యులు

**అనంతగిరి:** తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా నూతన కమిటీ చైర్మన్‌గా శివకుమార్‌ను ఎన్నుకున్నారు. శుక్రవారం వికారాబాద్‌లో జరిగిన ఉద్యోగ సంఘాల జేఏసీ ముఖ్య నాయకుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జ్ఞానేశ్వర్(టీజీవో జిల్లా అధ్యక్షుడు), అడిషనల్ సెక్రటరీగా చంద్రశేఖర్(పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు) మరి కొందరితో కమిటి ఏర్పాటు చేశారు. దాదాపు 30 సంఘాలు ఈ జేఏసీలో భాగస్వాములయ్యాయి.

### పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరిస్తాం

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

**ఇబ్రహీంపట్నం రూరల్:** పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం పెన్షన్ ఆదాలత్, జీపీఎఫ్ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 27 ప్రభుత్వ శాఖల్లో పని చేసిన 93 పెన్షన్ పెండింగ్ దరఖాస్తులు 39 మంది పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా సమస్యలు లేకుండా చూస్తామని చెప్పారు. దరఖాస్తులను అకౌంటెంట్ జనరల్ హైదరాబాద్ తెలంగాణ వారికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ ఎంఎస్ చందా పండిట్, అభయ్, సోనార్కర్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ పద్మావతి, జిల్లా రెవెన్యూఅధికారి సంగీత, డిప్యూటీ డైరెక్టర్ రాజు, సంబంధిత శాఖల అధికారులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

# ధరాఘాతం!

భారీగా తగ్గిన ఉల్లి ధరలు

- బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు రూ.1000లోపే
- ఆరుగాలం శ్రమించిన రైతుకు వచ్చేది రూ.600 మాత్రమే
- సాగు విస్తీర్ణం, పంట దిగుబడి పెరగడమే కారణం

**వికారాబాద్:** ఉల్లి ధరలు మరింత పతనమయ్యాయి. ఏకంగా క్వింటాలు రూ.1000కి పడిపోయింది. 60 కిలోల బ్యాగును రూ.500 నుంచి రూ.550 వరకు విక్రయిస్తున్నారు. రెండు నెలల క్రితం కిలో రూ.40 నుంచి రూ.60 వరకు ధర పలికిన ఉల్లి నేడు రూ.10లకు పడిపోయింది. గతంలో వినియోగదారులకు కన్నీళ్లు తెప్పించిన ఉల్లి.. నేడు రైతును నష్టాల్లో ముంచేసింది. పంట వేసే సమయంలో ధరలు బాగుండటంతో ఎక్కువ మంది సాగు చేశారు. కానీ దిగుబడి వచ్చే నాటికి ధరలు పూర్తిగా పతనమయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు మాత్రం లాభపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



పరిగి మార్కెట్‌కు తెచ్చిన ఉల్లిగడ్డలు

### పెట్టుబడి కూడా రాని పరిస్థితి

ఉల్లి సాగుకు నీటి వసతి తప్పనిసరి.. పంట కాలం ఆరు నెలలు.. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.70వేల వరకు ఖర్చు వస్తుంది.. రవాణా ఖర్చులు అదనం. ఎకరాకు 80 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం రూ.80 వేలకు మించి రాదు.. ఇలా చూసుకున్నా రైతుకు పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడ లేదు. ఈ సారి ఉల్లి దిగుబడి బాగానే వచ్చిందని.. పంట చేతికొచ్చే సమయానికి ధరలు పూర్తిగా పడిపోయాయని.. పెట్టుబడి కూడా రాదని రైతులు లబోదిబో మంటున్నారు. రెండు నెలల క్రితం క్వింటాలు ధర రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు ఉండేదని.. చిల్లరగా కిలో రూ.50 నుంచి 60 వరకు విక్రయించేవారని తెలిపారు. ప్రస్తుతం ఆశించిన ధరలు లేకపోవడంతో నష్టాలు చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గణనీయంగా పెరిగిన దిగుబడి

ఈ ఏడాది ఉల్లి సాగు గణనీయంగా పెరిగింది. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 3వేల ఎకరాలు కాగా ఈ సారి 4,500 ఎకరాల్లో పంట వేశారు. గతంలో ఎకరాకు 80 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది హైబ్రీడ్ రకం ఉల్లి సాగు చేయటంతో ఎకరాకు 100 నుంచి 130 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

### దళారులకే లాభాలు

ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసే రైతులకు నష్టాలు తప్పడం లేదు. పంట దిగుబడి వస్తే ధరలు లేకపోవడం.. సాగు చేయని సమయంలో విపరీతమైన ధరలు ఉండటం అన్నదాతలను కలవర పెడుతోంది. వీటికి తోడు ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతూనే ఉంటాయి. పంట కోతకు వచ్చే సమయంలో అకాల వర్షాల కారణంగా రైతులు నష్టాలు చవిచూడటం సాధారణంగా మారిపోయింది. ప్రభుత్వాలు ప్రకటించే మద్దతు ధర ఏ మాత్రం సరిపోదని రైతులు అంటున్నారు. పంట దిగుబడి బాగా వచ్చినా.. దెబ్బ తిన్నా రైతులకు మాత్రం ప్రయోజనం చేకూరడం లేదు. పరిస్థితులు ఎలా ఉన్నా దళారులు మాత్రం లాభపడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు లేవంటూ తక్కువకే పంట దిగుబడిని కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత ఎక్కువ ధరలకు విక్రయించి లాభాలు పొందుతున్నారు. ప్రతి సీజన్‌లో ఇదే పరిస్థితి పునరావృతం అవుతోంది.

### పట్టించుకోని ప్రభుత్వాలు

ధరలు పెరిగిన ప్రతిసారీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంటితుడుపు చర్యలకే పరిమితమవుతున్నాయి. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడం లేదు. ధరలు పెరిగినప్పుడు వినియోగదారులు.. పతనమైనప్పుడు రైతులు నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం వరకు సాగు విస్తీర్ణం పెంచేందుకు రాయితీపై విత్తనాలు ఇచ్చిన ప్రభుత్వాలు ఆ తర్వాత మిన్నకుండిపోయాయి.



ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# ‘సప్లిమెంటరీ’కి పక్కాగా ఏర్పాట్లు

కలెక్టర్ ప్రతీక్ జైన్

**అనంతగిరి:** ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్‌లోని కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు.. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని వివరించారు. జిల్లాలో 20 పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరం జనరల్‌లో 5,217మంది విద్యార్థులు, ఒకేషనల్‌లో 457 ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 2,071మంది, ఒకేషనల్‌లో 314 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ సదుపాయం కల్పించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా వైద్యాధికారి వెంకటరవణ, ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ, వివిధ శాఖల అధికారులు, జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ శంకర్ నాయక్, జిల్లా పరీక్షల సమన్వయ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, సత్తయ్య, ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామి, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### సజావుగా ధాన్యం సేకరణ

జిల్లాలో ఇప్పటి వరకు 25వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం నగరం నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి ధాన్యం కొనుగోలు, రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 128 కొనుగోలు కేంద్రాల ద్వారా 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు మంత్రికి వివరించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, టార్పాలిన్లు, సంచులు, తేమ శాతం కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సరైన సమయంలో రైతులు ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

# విద్యార్థుల సంఖ్య పెంచండి

- ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య
- డీఈఓ రేణుకాదేవి

**బంట్వారం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. శుక్రవారం కోట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించే ఉపాధ్యాయులు విద్యార్థుల వివరాలు సేకరించాలన్నారు. వీరందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందనే విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. డిజిటల్ బోధన, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్, భోజన వసతిపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇక నుంచి వారానికి ఒక్కసారి తల్లిదండ్రులతో సమావేశం ఉంటుందన్నారు. పాఠశాలల అభివృద్ధిలో స్థానికులు, తల్లిదండ్రుల సహకారం తప్పనిసరి పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డీఈఓ సత్కరించారు. అనంతరం కరీంపూర్ గేటు సమీపంలో నిర్మిస్తున్న కేజీబీవీ హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, పాఠశాల సిబ్బంది, కేజీబీవీ ఎస్ఓ పల్లవి, సీఆర్‌పీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి

**పరిగి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఇతర రాష్ట్రాల ఉద్యోగులకు ఒక్క డీఏ కూడా బకాయి లేదన్నారు. తెలంగాణలో మాత్రం ఐదు డీఏలు బకాయి ఉన్నట్లు పేర్కొన్నారు. నిండు సభలో ఒక రాష్ట్రానికి సీఎం అయి ఉండి అప్పు పుట్టడం లేదని అనడం సరికాదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గోపాల్, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు బస్వరాజ్, జాంప్ల, రూప్‌సింగ్, బాలకృష్ణ, నరేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘునందర్‌రెడ్డి

# ఫీజు బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మీనివాస్

**ఆమనగల్లు:** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో భాగంగా బకాయిలు విడుదల చేయకపోవడంతో లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బకాయి ఉన్న దాదాపు రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఓటీఎస్ కింద సెటిల్‌చేసి విద్యాసంవత్సరం ప్రారంభంలోనే చెల్లిస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. వెంటనే బకాయిలు చెల్లించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. సమావేశంలో టీఎస్ఎస్ఓ నాయకులు వంశీ, సుదర్శన్, చిక్కి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### పలువురు తహసీల్దార్ల బదిలీ

**అనంతగిరి:** జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పలువురు తహసీల్దార్లను శుక్రవారం ప్రభుత్వం బదిలీ చేసింది. మల్టీ జోన్ -2 పరిధిలో జరిగిన ఈ బదిలీల్లో వేరే జిల్లా నుంచి కూడా పలువురు మన జిల్లాకు బదిలీపై వచ్చారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న బి.జయరాం, ఎస్.సంధ్య, వై.వెంకటేష్ సంగారెడ్డి జిల్లాకు, వై.దానయ్య నారాయణపేటకు, గణేష్ యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ అయ్యారు. గద్వాల జిల్లాలో విధులు నిర్వహిస్తున్న షాహీదా బేగం, హైదరాబాద్ నుంచి జె.బుచ్చయ్య, ఎస్.అశోక్‌కుమార్, నల్లగొండ నుంచి జి.కిరణ్‌కుమార్, సంగారెడ్డి నుంచి వెంకట్‌స్వామి బదిలీపై జిల్లాకు వచ్చారు.

### సేంద్రియ సాగు లాభదాయకం

వ్యవసాయ శాస్త్రవేత్త యమునారెడ్డి



సమావేశానికి హాజరైన రైతులు, శాస్త్రవేత్తలు

**బంట్వారం:** రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతులు పాటిస్తే మంచిదని, నేలను కూడా కాపాడుకోవచ్చని తాండూరు వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త యమునారెడ్డి అన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండలం బుగ్గాపూర్ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. వానాకాలం సాగుకు అవసరమైన కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. పంట సాగుపై సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అంజయ్య, శాస్త్రవేత్త సుజాత, ఏఓ కరుణాకర్‌రెడ్డి, ఏఈఓలు సందీప్, నర్మద పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ‘అందాల’ డ్రెస్ డిజైనర్ మన స్వాతి..



స్వాతి డిజైన్ చేసిన డ్రెస్‌లలో అందాల భామలు



స్వాతి

**అనంతగిరి:** ప్రపంచ అందాల పోటీల్లో భాగంగా గురువారం భూదాన్ పోచంపల్లిలో తళుక్కుమన్న ముద్దుగుమ్మలకు డ్రెస్‌లు డిజైన్ చేసింది ఎవరో కాదు మన జిల్లాకు చెందిన మఠం వైద్యనాథ్ కూతురు ఎం.స్వాతినే. ఈమె ఆరేళ్లుగా హైదరాబాద్‌లో మైరీతి, తరం పేరిట డ్రెస్ డిజైనింగ్ చేస్తోంది. విదేశీ వనితలు, నటీమణులకు, ఉన్నత స్థాయిలో ఉన్న వారికి వివిధ ఆకృతుల్లో అందమైన డ్రెస్‌లు డిజైన్ చేసి ఇస్తోంది. ఈ క్రమంలో మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న 40 మంది అందగత్తెలు వారు కోరిన విధంగా డ్రెస్‌లను రూపొందించింది. పోచంపల్లి, నారాయణపేట చేనేత వస్త్రాన్ని వాడి దుస్తులు తయారు చేయడం వీరి ప్రత్యేకత. గురువారం జరిగిన కార్యక్రమంలో అందాల భామలు స్వాతి డిజైన్ చేసిన డ్రెస్‌లు ధరించి అలరించారు. దుస్తుల తయారీకి నెల రోజులు కష్టపడినట్లు తెలిసింది. స్వాతి తోపాటు మైరీతి, తరం మరో వ్యవస్థాపకులు, మితుల్ నిర్వాహకులు ఎం మహేంద్ర, ఎం మానస, వారి డిజైనర్స్ మౌనిక, రమ్య ఇతర సిబ్బంది ఎంతో కష్టపడ్డారు.

# సమస్యల పరిష్కారానికే ‘భూ భారతి’

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**ధారూరు:** రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే భూ భారతి చట్టం పని చేస్తుందని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. ధారూరు మండలం రాజాపూర్, నాగారం, కొండాపూర్ ఖుర్దు గ్రామాల్లో శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. కోర్టు పరిధిలో ఉన్న వాటిని మినహాయించి అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా జిల్లా, డివిజన్, మండల స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్లు జాజిదాబేగం, శ్రీనివాస్, దీపక్ సాంసన్, డీటీ విజయేందర్, ఆర్ఐ స్వప్న, రెవన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

# మీటర్ దొంగల గుట్టు.. రీడింగ్ మిషన్‌తో రట్టు

- అక్రమ మీటర్ల జారీపై మరింత లోతుగా విచారణ
- ఇప్పటికే ఏఈ సహా లైన్ ఇన్‌స్పెక్టర్, ఆర్టిజన్‌పై వేటు
- తాజాగా మరికొంత మంది ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** మీటర్ దొంగల గుట్టు రీడింగ్ మిషన్‌తో రట్టయింది. విద్యుత్ బిల్లుల జారీ కోసం వినియోగించిన మీటర్ రీడింగ్ మిషన్‌లోని జీపీఎస్ సాంకేతిక పరిజ్ఞానం ఇబ్రహీంబాగ్ డివిజన్‌లో మిస్సైన 42 విద్యుత్ మీటర్ల గుట్టును రట్టు చేసింది. ప్రత్యక్ష ప్రమేయం ఉన్న వారితో పాటు పరోక్షంగా ఇందుకు సహకరించిన వారిని పట్టించింది. సైబర్ సిటీ సర్కిల్ ఇబ్రహీంబాగ్ డివిజన్ (గండిపేట రెవెన్యూ సర్వే నంబర్ 246/1) చిత్రపురి కాలనీలోని పలు నిర్మాణాలకు తెలుగు సినీ వర్కర్స్ కో ఆపరేటివ్ సొసైటీ పేరున జనవరి 25న 42 విద్యుత్ మీటర్లు జారీ అయ్యాయి. డిస్కం జారీ చేసిన ఈ మీటర్లను దరఖాస్తుదారుని ఇంట్లో పెట్టకుండా ఇక్కడ విద్యుత్ పనులు దక్కించుకున్న ప్రైవేటు కాంట్రాక్టర్ చెన్నకేశవ రెడ్డి తన ఇంట్లో నిల్వ చేసుకున్నారు. నిజానికి డిస్కం మంజూరు చేసిన మీటర్లకు ఆ మరుసటి నెల నుంచే విద్యుత్ రీడింగ్, బిల్లుల జారీ ప్రక్రియను చేపట్టాలి. కానీ అలా చేయలేదు. ఈ విషయం తెలిసీ ఏఈ సహా లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు పట్టించుకోలేదు. అంతేకాదు ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఏ ఒక్క మీటర్‌కు కూడా రీడింగ్ నమోదు చేయలేదు. ఏప్రిల్‌లో డిస్కం సిబ్బంది కాంట్రాక్టర్ ఇంటికి చేరుకుని కనెక్షన్ కూడా ఇవ్వని ఖాళీ మీటర్లకు మినిమం బిల్లులు జారీ చేశారు. జనవరిలో జారీ చేసిన మీటర్లకు ఏప్రిల్‌లో రీడింగ్ నమోదు చేయడంపై ఏడీఈ అంబేడ్కర్‌కు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రీడింగ్ మిషన్‌లో అమర్చిన జీపీఎస్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కొల్లగొట్టిన మీటర్లను గుర్తించారు. అంతేకాదు కేటగిరీ-2 కింద జారీ చేయాల్సిన మీటర్లను కేటగిరీ-1 కింద జారీ చేసినట్లు తేలింది. అక్రమ వసూళ్లు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈ భాస్కర్‌రావు సహా లైన్ ఇన్‌స్పెక్టర్, ఆర్టిజన్‌పై ఇప్పటికే వేటు పడింది. ఇదే అంశంపై సీఎండీ సమగ్ర విచారణకు ఆదేశించగా, ప్రస్తుతం సెక్షన్ల వారీగా ఇప్పటి వరకు జారీ చేసిన విద్యుత్ మీటర్లు, వసూలు చేస్తున్న నెలవారీ బిల్లుల వివరాలపై ఆరా తీస్తున్నారు. సెక్షన్ పరిధిలో ఇప్పటి వరకు 225 మీటర్లు జారీ చేయగా, వీటిలో ఇప్పటికే భారీగా విద్యుత్ రీడింగ్ నమోదైన పలు మీటర్లు కన్పించకుండా పోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కన్పించకుండా పోయిన ఆయా మీటర్లను గుర్తించే పనిలో అధికారులు ఉన్నట్లు సమాచారం. ఇది బయటికి వస్తే మరింత మంది అధికారులు ఈ కేసులో ఇరుక్కునే అవకాశం లేకపోలేదు.

## క్లుప్తంగా

### రాజీవ్ యువ వికాసం రుణాలు ఇవ్వాలి

తాండూరు టౌన్: రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణాల మంజూరులో బ్యాంకుల జోక్యం లేకుండా చూసుకోవాలని, రాజకీయ నాయకుల ప్రమేయం కూడా లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న ప్రతి నిరుద్యోగికి రుణం ఇవ్వాలన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క నిరుద్యోగికి అన్యాయం జరిగినా ఆందోళనలు తప్పవన్నారు.

### బాధ్యతల స్వీకరణ



కుల్కచర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా రమేశ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన తాండూరు టౌన్ ఠాణాలో విధులు నిర్వహించారు. ఇదివరకు ఇక్కడ ఎస్ఐగా ఉన్న అన్వేష్‌రెడ్డి బదిలీపై జిల్లా కార్యాలయానికి వెళ్లారు. శుక్రవారం రమేశ్ బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో అందరి సహకారంతో ముందుకు సాగుతామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయొద్దన్నారు.

### పశుగ్రాసం దగ్ధం



కాలిపోయిన గడ్డివామును చూపిస్తున్న రైతు

దుద్యాల్: ప్రమాదవశాత్తు గడ్డి వాము దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని లగచర్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మ్యాదరి మాదరప్పకు ఉన్న పశువులకు మేత కోసమని వరి గడ్డిని నిల్వ ఉంచుకున్నాడు. మధ్యరాత్రి ప్రమాదవశాత్తు గడ్డివాము కాలిపోతుండడంతో విషయం తెలుసుకొని అక్కడి వెళ్లి ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే 90 శాతం గడ్డి కాలి బూడిదయ్యింది. మూడు ట్రాక్టర్ల గడ్డి దగ్ధం అయినట్లు వాపోయాడు. సుమారు రూ.40 వేలు నష్టపోయానని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

### ఔత్సాహిక ఆలోచన పెరగాలి

**ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి**



అంతర్జాతీయ సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

మొయినాబాద్: భారత దేశ యువతలో ఔత్సాహిక ఆలోచన ధోరణిని పెంపొందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో 'సుస్థిర ప్రపంచం కోసం ఔత్సాహిక, ఆవిష్కరణలు' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత సుస్థిర అభివృద్ధిపై ఆసక్తి పెంచుకుని.. ఆ దిశగా ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచడం కోసం మేనేజ్‌మెంట్ విద్యలో ఆ అంశాన్ని చేర్చాలని సూచించారు. యూఎస్ఏ స్కైలైన్ యూనివర్సిటీ ప్రతినిధి శ్రీమహేష్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. పర్యావరణ అనుకూల పరిశ్రమల ఏర్పాటు వైపు యువత అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ రచనల సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ డీన్ రాములు, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్ రెడ్డి, కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సారం లేక.. దిగుబడి రాక



దోమలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

**భూసార పరీక్షలు చేయక రైతుల ఇబ్బందులు**

- సరైన మోతాదులో పంటకు అందని పోషకాలు

పరిగి: రైతులు అధిక పంట దిగుబడి సాధించేందుకు పోటీ పడి ఎరువులు వేస్తున్నా నష్టాలు చవి చూడాల్సి వస్తుంది. భూమిలో పోషక లోపాలు గుర్తించకుండా.. వేసిన పంటలే వేయడం, అధిక మోతాదులో ఎరువులు చల్లడం వల్ల పంటలపై చీడ పీడల దాడి అధికమై సస్యరక్షణ ఖర్చు పెరుగుతోంది. భూములు నిస్సారమై భవిష్యత్‌లో పంటలు వేయడానికి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉంది. నేలలో అంతర్లీనంగా ఉన్న పోషకాలను కాపాడుకోవాలి. భూసారం తెలుసుకోకుండా ఎలాంటి పంటలు సాగు చేసినా దిగుబడి లేక ఆర్థికంగా చతికిల పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం భూసార పరీక్షలు చేయడానికి మట్టి నమూనాల సేకరణకు అనుకూలమైన సమయం. వానాకాలం పంటలు విత్తుకునే సమయానికి ఫలితాలు వస్తే అందుకు అనుగుణంగా విత్తనం, ఎరువులు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది భూసార పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

**అన్నదాతలపై భారం**

పరిగి నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 1,32,000 ఎకరాల సాగు భూములున్నాయి. ఇందులో నల్లరేగడి, ఎర్రమట్టి, ఇసుక, చౌడు నేలలు ఉన్నాయి. జిల్లాలో అన్ని రకాల పంటలకు అనుకూలమైన నేలలు ఉన్నా రైతులు అధికంగా పత్తి, వరి, మొక్కజొన్నలనే సాగు చేస్తున్నారు. నేల స్వభావం తెలియకుండా అధిక దిగుబడుల కోసం ఎరువులు, క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. పంటకు ఏ మేరకు ఎరువులు అవసరమో రైతులకు అవగాహన ఉండాలి. భూమిలో ఏయే పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవాలంటే భూసార పరీక్షల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. మట్టి పరీక్షలు నిర్వహిస్తే పోషక లోపాలను గుర్తించవచ్చు. తద్వారా మోతాదులో రసాయన ఎరువులు వాడితే అనవసర ఖర్చు తగ్గించుకోవచ్చు. భూసారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

**ఆదేశాలు అందాయి**



మండలంలో 225 మంది రైతుల నుంచి భూసార పరీక్షలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. రెండు స్కీంల ద్వారా భూసార పరీక్షలకు వీలుంది. మండలంలోని అన్ని గ్రామాల్లో పరీక్షలు చేయాలని ఎలాంటి సూచనలు అందలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే నిర్వహిస్తాం. – డీఎస్ లక్ష్మీకుమారి, ఏడీఏ, పరిగి

**పోషక సమతుల్యత ముఖ్యం**

పంటలు భూమిలోని పోషకాలను ఏ మేరకు ఉపయోగించుకుంటాయో దానిపై దిగుబడులు ఆధారపడి ఉంటాయి. పోషకాలు ఎక్కువైనా ఆశించిన దిగుబడులు రావు. సాధారణంగా రైతులు భాస్వారం, పొటాష్ ఎరువులను మోతాదు కంటే తక్కువగాను, నత్రజని ఎరువును మోతాదుకంటే రెండు, మూడు రేట్లు ఎక్కువగాను వేస్తుంటారు. దీనివల్ల పోషకాల సమతుల్యత దెబ్బతింటుంది. నత్రజని ఎరువును అధిక వినియోగం వల్ల పంట విపరీతంగా ఎదుగీత పడిపోతుంది. పూత ఆలస్యంగా రావడం, గింజలు ఎక్కువగా తాలురావడం వంటివి ఉంటాయి. పంట చీడపీడలకు సులభంగా లోనవుతుంది. చివరికి రైతు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. ఏ పంటకు ఏ పోషక పరిమాణంలో అవసరమో తెలుసుకుని తగిన మోతాదులో అందించడాన్నే పోషక సమతుల్యత అంటారు. ఇది భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వాడవచ్చు.

# కల్లాల్లేక.. రోడ్లపైనే వడ్లు!



గుముడాల వెళ్లే దారిలో ధాన్యం కుప్ప

**అవస్థలు పడుతున్న వాహనదారులు**

దౌల్తాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపై పోసిన ధాన్యం కుప్పలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పంటను ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు తారు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. చేతికొచ్చిన పంట దిగుబడుల్లో తేమ శాతం తగ్గించుకునేందుకు ధాన్యం ఆరబెడుతున్నారు. రోజుల తరబడి వడ్ల కుప్పలు ఉండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. గతంలో ప్రమాదాలు సంభవించిన సంఘటనలున్నాయి. ఏటా సీజన్ రాగానే రైతులు రోడ్లపై ఇరువైపులా పంట కుప్పలు పోయడంతో రహదారులు కల్లాలుగా మారాయి. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో రాత్రి పూట వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు.

**కలగానే కల్లాలు**

గతంలో ఉపాధి హామీ పథకంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, బీసీలకు 90శాతం సబ్సిడీపై కల్లాల నిర్మాణానికి దరఖాస్తులను స్వీకరించింది. కొన్ని గ్రామాల్లో పూర్తయినా బిల్లులు రాలేదని కొన్ని అసంపూర్తిగానే మిగిలిపోయాయని రైతులు వాపోతున్నారు. మూడేళ్లుగా కల్లాల పథకం నిలిచిపోవడంతో అర్హులైన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు గ్రామీణుల కష్టాలు గుర్తించి పథకాన్ని పునరుద్ధరిస్తే మేలు జరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.



ఈర్లపల్లి గ్రామం వద్ద రోడ్డు పక్కన వడ్ల రాశి

# లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మురహరి



నూతన కార్యవర్గ సభ్యులతో గురునాథ్‌రెడ్డి

కొడంగల్: పట్టణ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సామాజిక కార్యకర్త మురహరి వశిష్టను శుక్రవారం రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2025–26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి సమక్షంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మురహరి వశిష్ట, కార్యదర్శిగా వడ్డె భీంరాజు, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్, మెంబర్ షిప్ కమిటీ చైర్మన్‌గా ముద్దప్ప దేశ్‌ముఖ్, ఉపాధ్యక్షులుగా కేవీ రాజేందర్, దామోదర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా కానుకుర్తి రమేష్, పీఆర్‌ఓగా శ్రీకిషన్‌రావులను ఎన్నుకున్నారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా ఆరు.గురునాథ్‌రెడ్డి, దాసప్ప యాదవ్, శ్రీనివాస్ గుప్త, కానుకుర్తి వెంకట్‌రెడ్డి, ఏన్గుల భాస్కర్, శివకుమార్ గుప్తాలు వ్యవహరిస్తారు. గతేడాది అధ్యక్షుడిగా పనిచేసిన మురహరి వశిష్ట ఆధ్వర్యంలో గతం నుంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గురునాథ్‌రెడ్డి కుటుంబానికి విధేయునిగా ఉన్న మురహరి వశిష్టను రెండోసారి లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా ఎంపిక చేయడం పట్ల ఆయన మిత్రులు బాధ్యత స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# భక్తిభావాన్ని అలవర్చుకోవాలి



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో శ్రీ సీతారాముల, లక్ష్మణ, భరత, శత్రజ్ఞ, హనుమంతుని విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మహిళ అదృశ్యం



హంసమ్మ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన హంసమ్మ(29) అనే మతిస్థిమితం లేని మహిళ ఈ నెల 12 నుంచి కనిపించడం లేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పీఎస్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే 87126 62383 నంబర్‌కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

### సేంద్రియ సాగుతో అధిక లాభాలు

**వర్సిటీ శాస్త్రవేత్తలు మాధవి, లీలారాణి**

మొయినాబాద్: సేంద్రియ వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు కలుగుతాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఏ.మాధవి, పి.లీలారాణి అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో పంటల సాగు, భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులతోపాటు నేల ఆరోగ్యాన్ని, భూసారాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. భూసార పరీక్షలు చేయించి నేల స్వభావాన్ని బట్టి తగిన మోతాదులో జీవన ఎరువులు వాడాలని సూచించారు. పంటల సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అనురాధ, పీహెచ్‌డీ విద్యార్థులు రాజ్‌కుమార్, నవ్య, అశోక్, ఏఈఓ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మల్లన్న బోనాలు

మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి గ్రామంలో వెలసిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం మల్లన్న బోనాలు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఆలయంలో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం ఉదయం అగ్నిగుండం, మధ్యాహ్నం పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. – పూడూరు



అంగడిచిట్టంపల్లిలో బోనాలతో ఊరేగింపు

### కంకర పోసి వదిలేశారు



అసంపూర్తి రోడ్డుతో గ్రామస్తులు నిత్యం అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో వీరభద్రేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణం సమయంలో మధ్యలోనే వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి దేవాలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి వదిలేశారు. దీంతో ఆలయానికి వెళ్లే భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. – తాండూరు రూరల్

# తాగునీటి తండ్లాట!

**నిలిచిన మిషన్ భగీరథ సరఫరా**

- సంకిరెడ్డిపల్లిలో అవస్థలు పడుతున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: తాగునీరు లేక గొంతెండుతుందని మండలంలోని సంకిరెడ్డిపల్లి గ్రామస్తులు విలపిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా నేటికి గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గొంతు తడిపేందుకు తండ్లాడుతున్నారు. సంకిరెడ్డిపల్లి గ్రామం, సంకిరెడ్డిపల్లి తండా ఉన్నాయి. రెండు గ్రామాలు కూడా తెలంగాణ–కర్ణాటక సరిహద్దు అటవీ ప్రాంతంలో ఉంటాయి. వేసవికాలం వచ్చిందంటే చాలు గ్రామస్తులు, గిరిజనులకు కంటిమీది కునుకు లేకుండా పోతుంది. సాంకేతిక సమస్యలతో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిందంటే చాలు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా ఇదే తంతు జరుగుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

**మిషన్ భగీరథ నీరే దిక్కు**

ప్రస్తుతం మిషన్ భగీరథ ట్యాంకుల నుంచి నీటి సరఫరా అవుతుంది. ప్రతి రోజు సంకిరెడ్డిపల్లి గ్రామానికి 60 వేల లీటర్లు, తండాకు 40 వేల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే మిషన్ భగీరథ సరఫరా నిలిచిపోతే గ్రామస్తులు, తండావాసులకు ప్రత్యామ్నాయంగా నీటి సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. దీంతో గ్రామంలోని ఊరడమ్మ దేవాలయం వద్ద సింగిల్ ఫేజ్ మోటారు ఉన్నా సరిపోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వ్యవసాయ బోరు మోటార్ల వద్ద నుంచి గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో దాహార్తి తీర్చుతున్నారు. ప్రస్తుతం వేసవికాలంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు, తండావాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

**కొత్త బోరు వేస్తున్నాం**



సంకిరెడ్డిపల్లిలో తాగునీటి సమస్య ఉంది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు తండాలో వారం క్రితం బోరు వేశాం. కానీ నీళ్లు ఆశించిన స్థాయిలో రాలేదు. అందుకే మరో కొత్త బోరు వేస్తున్నాం. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 లక్షలతో బోరువేసి, ట్యాంక్‌లకు కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేస్తాం. దీంతో ప్రజలకు తాగునీటిని అందిస్తాం. – ప్రణయ్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, తాండూరు



హనుమాన్ దేవాలయం సమీపంలో ట్యాంకర్ వద్ద మహిళలు



శివారులో బోరు మోటారు నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

### గంజాయి చాక్లెట్ల పట్టివేత

**ఇద్దరు వ్యక్తుల రిమాండ్**

ఇబ్రహీంపట్నం రూరల్: గుట్టుచప్పుడు కాకుండా కిరాణం దుకాణంలోకి గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న ముఠాను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన షర్వాన్ కుమార్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడలో పాన్‌షాప్ నిర్వహించేవాడు. నాలుగు నెలలుగా రాజస్తాన్ నుంచి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి వాటిని కూలీలకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన అజిత్ సర్దార్‌తో పరిచయడం ఏర్పడింది. ఇద్దరు కలిసి గంజాయి చాక్లెట్ల వ్యాపారం చేద్దామని నిర్ణయానికి వచ్చారు. షర్వాన్ కుమార్ రాజస్తాన్ నుంచి గంజాయి చాక్లెట్లు తీసుకొని వచ్చి మరో వ్యక్తి బినోద్ సర్దార్‌కు ఇస్తే.. అతను చుట్టు పక్కల ఉండే లేబర్‌కు అమ్మాలని పథకం రచించారు. తమ ఒప్పందం ప్రకారం బుధవారం సాయంత్రం ఐదు డబ్బాలలో 810 గ్రాముల గంజాయి చాక్లెట్లను షర్వాన్ కుమార్ రాజస్తాన్ నుంచి తీసుకొచ్చి నాదర్‌గుల్ ఇండస్ట్రియల్ ఏరియాలో టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ వద్ద బినోద్ సర్దార్‌కు ఇస్తుండగా ఆదిబట్ల పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శుక్రవారం వెల్లడించారు.

### నిమ్స్‌లో స్లిట్ ల్యాంప్ ఏర్పాటు

లక్డీకాపూల్: నిమ్స్‌లో రుమటాలజీ సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల కంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక స్లిట్ ల్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో సమకూర్చిన ఈ స్లిట్ ల్యాంప్‌ను శుక్రవారం డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుమటాలజీ క్లినిక్‌లో ప్రతి మంగళవారం పిల్లలకు స్లిట్ ల్యాంప్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రుమటాలజీ రోగుల కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ రూ. 4 లక్షల విలువైన ఆధునిక స్లిట్ ల్యాంప్‌ను సమకూర్చిందన్నారు. క్లినికల్ ఇమ్యునాలజీ, రుమటాలజీ విభాగంలో ఆధ్వర్యంలో అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో రుమటాలజీ విభాగం హెచ్ఓడీ డా.లీజా రాజశేఖర్, ఎల్వీ ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.ప్రసాంత్ గర్గ్, యూవైటిస్ నిపుణులు డా. బసు, పీడియాట్రిక్ రుమటాలజీ నిపుణుల డా.కీర్తి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



స్లిట్ ల్యాంప్‌ను ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప